
స్వర్ణోత్సవాలను ప్రారంభిస్తున్న మాజీ ఉపరాష్ట్రపతి

విద్యతో పాటు సనాతన ధర్మాన్ని పిల్లలకు బోధించడం అభినందనీయం



- మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్య నాయుడు
- ఘనంగా పీఎస్ఎం హైస్కూల్ స్వర్ణోత్సవాలు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లిలోని వివేకానంద సేవా సమితి స్వర్ణోత్సవాలు మంగళవారం పీఎస్ఎం హైస్కూల్ ప్రాంగణంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్య నాయుడు, విశిష్ట అతిథిగా మహాసహస్రావధాని పద్మశ్రీ డా. గరికపాటి నరసింహారావు, ఆత్మీయ అతిథిగా బీవీపీ చారిటబుల్ ట్రస్ట్ అశ్వినీ సుబ్బారావు, సభాధ్యక్షుడిగా వివేకానంద సేవా సమితి చైర్మన్ సీహెచ్ హనుమంతరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీ ఉపరాష్ట్రపతి మాట్లాడుతూ... సంస్థను 50 సంవత్సరాలుగా నిర్వహించడం గొప్ప విషయమన్నారు. స్వామి వివేకానంద ఇచ్చిన పిలుపు ఇప్పటి వరకు మార్మోగుతూనే ఉందన్నారు. ఈ దేశానికి ఏమైనా చేద్దామనే మనసు ఉరకలెత్తుతుందన్నారు. చదువు చెప్పటమే కాదన్నారు. సనాతన ధర్మాన్ని కూడా విద్యార్థులకు అలవర్చాలన్నారు. పీఎస్ఎం స్కూల్‌లో విద్యతో పాటు సనాతన ధర్మాన్ని చెప్పటం అభినందించదగ్గ విషయమన్నారు.

మాతృభాషలో చదువుకుంటే ఇతర భాషలు సులువుగా నేర్చుకోవచ్చు...

తెలుగుభాష గొప్పతనాన్ని విద్యార్థులకు వివరించారు. తాను కూడా తెలుగు మాతృభాషలో చదువుకున్నానని తెలిపారు. ప్రతి ఒక్కరూ మాతృభాషలో చదువుకుంటే ఇతర భాషలు కూడా సులువుగా వస్తాయని పేర్కొన్నారు. ముందు మాతృభాష నేర్చుకోవాలని తరువాతే ఇతర భాషలు నేర్చుకోవాలన్నారు. ఈ విషయాన్ని ప్రతి ఒక్కరూ నేర్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అన్ని విద్యా సంస్థలు ముందుగా మాతృభాషకు ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. చిన్నప్పటి నుంచే పిల్లలకు మన సాంస్కృతిక పద్ధతులు నేర్పించాల్సిన అవసరం ఉందన్నారు.

పూర్వం ఐదేళ్లు దాటిన తర్వాతే బడిలో చేర్పించేవారు..

అనంతరం పద్మశ్రీ డా. గరికపాటి నరసింహారావు మాట్లాడుతూ ప్రస్తుతం పిల్లలను 3 సంవత్సరాలలోపే పాఠశాలలో చేర్పిస్తున్నారని పూర్వం 5 సంవత్సరాలు దాటిన పిల్లలను పాఠశాలలో చేర్పించేవారని తెలిపారు. అప్పటి వరకు తల్లి గురువుగా పిల్లలకు అనేక కథలను చెబుతూ చిన్నారులకు విజ్ఞానం నేర్పిస్తుందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొని అందరినీ అలరించారు. ఈ కార్యక్రమంలో కార్యనిర్వాహక అధ్యక్షులు ఎ. జలవేందర్, అధ్యక్షులు సీహెచ్.హనుమంతరావు, కార్యదర్శి సీహెచ్.రాజేశ్వరరావు, ఉపాధ్యక్షులు బి.సుజన ప్రభ, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పండగకు ఊరెళ్తున్నారా.. ఇళ్లు జాగ్రత్త.!

కూకట్‌పల్లి ఏసీపీ శివభాస్కర్


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కూకట్‌పల్లి ఏసీపీ శివభాస్కర్

భాగ్యనగర్‌కాలనీ: సంక్రాంతి పండుగ సెలవులను పురస్కరించుకొని పల్లె 'టూర్'కు వెళ్లే ఆయా కాలనీ, అపార్టుమెంట్‌వాసులు దొంగతనాల పట్ల అప్రమత్తంగా ఉండాలని కూకట్‌పల్లి ఏసీపీ శివభాస్కర్ సూచించారు. మంగళవారం కేపీహెచ్‌బీ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ వెంకన్న, అడిషనల్ సీఐ రాజేందర్‌గౌడ్‌లతో కలిసి ఆయన మాట్లాడారు. గతంలో సంక్రాంతి సెలవుల్లో జరిగిన దొంగతనాలను పరిగణలోకి తీసుకొని ప్రజలు ముందస్తు జాగ్రత్తలు పాటించాలన్నారు. సొంత గ్రామాలకు వెళ్లే వారు ఇళ్లల్లో బంగారు ఆభరణాలు, వెండి వస్తువులు, నగదుతో పాటు విలువైన వస్తువులను ఇంట్లో ఉంచకుండా బ్యాంక్ లాకర్‌లో లేదా బంధువుల ఇళ్లల్లో లేదా తమ వెంట తీసుకెళ్లాలని సూచించారు.

◆ అంతేకాకుండా ఇంటి ముందు ద్విచక్ర వాహనాలు, కార్లను బయట పార్కింగ్ చేయకుండా ఇంటి ఆవరణలో పార్కింగ్ చేసుకోవాలన్నారు. సీసీ కెమెరాలు ఉన్నవారు ఎప్పటికప్పుడు వారి మొబైల్ ఫోన్‌లో ఇంటిపై ఓ కన్ను వేసి ఉంచాలన్నారు. పండుగలకు వెళుతున్న సమయంలో విలువైన వస్తువులు తీసుకెళ్లే క్రమంలో ఎప్పటికప్పుడు వాటిని పరిశీలిస్తూ గమ్యానికి చేరుకునేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. బస్సులు ఎక్కి, దిగే సమయంలో దొంగల చేతి వాటం ప్రదర్శించే అవకాశం ఉంటుంది. ఏదైనా అనుమానం వస్తే సంబంధిత పోలీసులకు సమాచారం అందజేయాలని సూచించారు. తమ బాధ్యతగా దొంగతనాలను అరికట్టేందుకు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఎప్పటికప్పుడు ప్రచారం నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలని కోరారు.

ఊరెళ్తున్నట్లు సోషల్ మీడియాలో పెట్టొద్దు

- పండుగకు ఊర్లకు వెళ్లే వారు జాగ్రత్తలు తీసుకోవాలి
- కూకట్‌పల్లి ఇన్‌స్పెక్టర్ కృష్ణమోహన్


విలేకరుల సమావేశంలో ఊరెళ్లే వారికి సూచనలు చేస్తున్న ఇన్‌స్పెక్టర్ కృష్ణమోహన్

మూసాపేట: సంక్రాంతి పండుగకు గ్రామాలకు వెళ్లే ప్రజలు ఊరెళ్తున్నట్లు సోషల్ మీడియాలో ఎప్పటికప్పుడు అప్‌డేట్ ఇవ్వొద్దని కూకట్‌పల్లి ఇన్‌స్పెక్టర్ కృష్ణమోహన్ అన్నారు. మంగళవారం కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో సంక్రాంతి పండుగకు ఊర్లకు వెళ్లే వారికి పలు సూచనలు చేశారు. అనంతరం ప్రచారం చేసేందుకు ఆటోను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సోషల్ మీడియాలో ఊరు వెళ్తున్నాం.. వచ్చాం.. పండుగ వేడుకలు ప్రారంభం అంటూ అప్‌డేట్స్ ఇవ్వడంతో దొంగలకు మీరే దొంగతనం చేసుకోమని చెప్పినట్లు అవుతుందన్నారు. గ్రామాలకు వెళ్లేటప్పుడు పోలీస్‌స్టేషన్‌లో సమాచారం అందించాలని అప్పుడు పెట్రోలింగ్, నిఘా పెంచుతామన్నారు.

సెంట్రల్, అలారం లాక్ సిస్టమ్ అమర్చుకోవాలి...

ఇంటికి సెంట్రల్ లాక్ సిస్టమ్, అలారం లాక్‌లు అమర్చుకోవాలని సూచించారు. బంగారం, వెండి ఆభరణాలు, డబ్బును లాకర్‌లో ఉంచుకోవాలని కోరారు. లేదా వెంట తీసుకెళ్లడం ఇళ్లలోని రహస్య ప్రదేశాల్లో దాచుకోవాలని సూచించారు. ఇంటి బయట చెప్పులు, ఇతర సామగ్రి ఉంచడం, హాల్‌లో లైట్ వేసి ఉంచటం ద్వారా ఇంట్లో జనాలు ఉన్నారని దొంగలు భావిస్తారని తెలిపారు. ఇంటి ముందు పాల పాకెట్స్, పేపర్‌లు జమ కాకుండా చూసుకోవాలన్నారు. ఇంటి పక్క వారికి, వాచ్‌మెన్‌కు చెప్పి వెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఐ వెంకటేశం, సబ్ ఇన్‌స్పెక్టర్లు రామకృష్ణ, ఇందసేనారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


పండగ సెలవుల్లో జరిగే దొంగతనాలపై ఆటో ద్వారా అవగాహన కల్పిస్తున్న పోలీసులు

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

కూకట్‌పల్లి: విద్యుత్ మరమ్మతుల కారణంగా పలు ప్రాంతాల్లో విద్యుత్ నిలిపివేయనున్నట్లు ఆల్విన్‌కాలనీ ఏఈ బి. శరత్ బాబు ఓ ప్రకటనలో తెలిపారు. బుధవారం ఆర్‌పీకాలనీ, పాపారాయుడు నగర్, ధీనబంధుకాలనీ, హనుమాన్‌నగర్, సాయిబాబా ఆలయం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు..

పాపారాయుడు నగర్ ఫీడర్ పరిధిలో..

పాపారాయుడు నగర్, రామారావునగర్, వైష్ణవినగర్, సాయిబాబా నగర్, ఎన్విరాన్‌మెంట్ కాలనీల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు..

పాపిరెడ్డినగర్ ఫీడర్ పరిధిలో...

ప్రగతినగర్, పాపిరెడ్డినగర్, హనుమాన్‌నగర్‌లలో మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ నిలిపివేయనున్నట్లు తెలిపారు.

పరామర్శ


సంతోష్‌గుప్తాను పరామర్శిస్తునన మేడ్చల్ జిల్లా పార్టీ అధ్యక్షుడు పన్నాల హరీష్‌రెడ్డి

కూకట్‌పల్లి: రామాంతపూర్ డివిజన్, ఇందిరానగర్‌లోని బీజేవైఎం నాయకుడు సంతోష్ గుప్తా దురదృష్టవశాత్తు రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. మంగళవారం మేడ్చల్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు పన్నాల హరీష్‌రెడ్డి ఆయన నివాసంలో బీజేపీ నాయకులతో కలిసి ఆయనను పరామర్శించి ఆరోగ్య వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ఉప్పల్ అసెంబ్లీ కన్వీనర్ దేవసాని బాలచందర్, బీజేపీ రామంతపూర్ డివిజన్ అధ్యక్షుడు బండారు వెంకటరావు, సెంట్రల్ ఫిలిం సెన్సార్ బోర్డు మెంబర్ జగదీష్ పాల్గొన్నారు.

సాంకేతిక విద్యలో నాణ్యత పెంపుపై దృష్టి

ఉస్మానియా యూనివర్సిటీ: తెలంగాణ ప్రభుత్వం సాంకేతిక విద్యలో నాణ్యత పెంపు పై దృష్టి సారించినట్లు ఉన్నత విద్యాశాఖ ముఖ్య కార్యాదర్శి బుర్ర వెంకటేశం పేర్కొన్నారు. మంగళవారం ఓయూ క్యాంపస్ ఠాగూర్ ఆడిటోరియంలో ఏఐసీటీఈ విస్తృత స్థాయి అవగాహన సదస్సు జరిగింది. కార్యక్రమానికి ఓయూ రిజిస్ట్రార్ ప్రొ.లక్ష్మీనారాయణ అధ్యక్షత వహించగా ఏఐసీటీఈ వైస్ ఛైర్మన్ డాక్టర్ అభయ్‌జెరే ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన వివిధ వృత్తి విద్య కళాశాలల నిర్వాహకులు హాజరయ్యారు. సాంకేతిక విద్యలో వస్తున్న మార్పులు, నూతన అనుమతులు, నిబంధనలు, ఇతర సందేహాలను పలువురు వక్తలు నివృత్తి చేశారు.

సావిత్రీబాయిని ఆదర్శంగా తీసుకోవాలి

ఉస్మానియా యూనివర్సిటీ: నేటి మహిళలు సావిత్రీ బాయి పూలేను ఆదర్శంగా తీసుకోవాలని ఓయూ మహాత్మా జ్యోతి బాయి పూలే పరిశోధన కేంద్రం డైరెక్టర్ డా.వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం మెదక్ ప్రభుత్వ మహిళ డిగ్రీ కాలేజీ సాధికారత విభాగం, ఓయూ ఆధ్వర్యంలో స్త్రీ విద్యకోసం సావిత్రీబాయి పూలే విశిష్ట సేవలు అనే అంశం పై వర్క్‌షాప్ జరిగింది. కార్యక్రమానికి ప్రిన్సిపల్ డా.హుస్సేన్ అధ్యక్షత వహించగా డా.వెంకటేశ్వర్లు ముఖ్యఅతిథిగా హాజరై మహిళల విద్యాభివృద్ధి కోసం సావిత్రీబాయి చేసిన సేవలను వివరించారు.


కాలనీల్లో మౌలిక వసతుల కల్పనే ధ్యేయం

ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ


కాలనీవాసుల నుంచి సమస్యలను అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ

భాగ్యనగర్‌కాలనీ: శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలోని ప్రతి కాలనీలో మౌలిక వసతుల కల్పనే ధ్యేయంగా ముందుకు వెళుతున్నామని ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ అన్నారు. మంగళవారం హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని గౌతమినగర్‌లో కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావుతో కలిసి ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు కాలనీలో ఉన్న పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ... నియోజకవర్గం సమగ్ర అభివృద్ధే ధ్యేయంగా దశలవారీగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని అన్నారు. అసంపూర్తిగా ఉన్న సమస్యలను గుర్తించి త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామని పేర్కొన్నారు. ప్రధానంగా కాలనీలో డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే విధంగా కృషి చేస్తున్నాని తెలిపారు. అదేవిధంగా గౌతమినగర్‌లోని ప్రహరీ నిర్మాణ పనులను పరిశీలించారు. ప్రజలకు ఇబ్బందులు కలిగించకుండా పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టౌన్‌ప్లానింగ్ ఏసీపీ సుస్మితా, సూపర్‌వైజర్ సోమేష్, వర్క్ ఇన్‌స్పెక్టర్ మహదేవ్, నాయకులు పాల్గొన్నారు.

యూపీహెచ్‌సీ సెంటర్ సమస్యలను పరిష్కరిస్తా


మెడికల్ ఆఫీసర్ శాలినితో కలిసి సమావేశమైన కార్పొరేటర్ సబిహా బేగం

మోతీనగర్: అల్లాపూర్ డివిజన్ పరిధిలోని పర్వత్‌నగర్ యూపీహెచ్‌సీ సెంటర్‌లో మెడికల్ ఆఫీసర్‌గా శాలిని బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా మంగళవారం కార్పొరేటర్ సబిహా బేగం ఆమెకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం సెంటర్‌లో నెలకొన్న పలు సమస్యల గురించి మెడికల్ ఆఫీసర్‌ను అడిగి తెలుసుకున్నారు. నీటి సప్లై, రాత్రిపూట వాచ్‌మెన్, రాత్రిపూట స్టాఫ్ నర్సులు కావాలని, అంబులెన్స్ ఏర్పాటు చేయాలని కోరారు. ఈ సమస్యలన్నీ ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు లింగాల ఐలయ్య, కో-ఆర్డినేటర్ వీరారెడ్డి, పర్వత్‌నగర్ సంక్షేమ సంఘం అధ్యక్షులు జాహిద్ షరీఫ్ బాబా పాల్గొన్నారు.

డిప్లొమా స్టూడెంట్ ఫెడరేషన్ కేలండర్ ఆవిష్కరణ


కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న వైస్‌చాన్సలర్ ప్రొ. కట్టా నరసింహారెడ్డి

బాలానగర్: డిప్లొమా స్టూడెంట్ ఫెడరేషన్ కేలండర్‌ను జేఎన్‌టీయూహెచ్ వైస్‌చాన్సలర్ ప్రొ. కట్టా నరసింహారెడ్డి మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... డీఎస్ఎఫ్ స్థాపించిన నుంచి ఇప్పటి వరకు పాలిటెక్నిక్ విద్యార్థుల కోసం నిర్వహిస్తున్న సంక్షేమ కార్యక్రమాలను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో డిప్లొమా స్టూడెంట్ ఫెడరేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎరవెల్లి జగన్, అభిషేక్, ప్రదీప్ మానసం శ్యామ్, చింతల అఖిల, సోను తదితరులు పాల్గొన్నారు.

కూకట్‌పల్లి ఆర్టీసీ డిపోలో వనభోజన వేడుక


వనభోజన కార్యక్రమంలో పాల్గొన్న ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికులు

మూసాపేట: కూకట్‌పల్లి ఆర్టీసీ డిపోలో మంగళవారం ఆర్టీసీ వనభోజన కార్యక్రమం రెండోరోజు కూడా నిర్వహించారు. ఆర్టీసీ కార్మికులకు భోజనాలతో పాటు ఆటలు, పాటలతో సరదాగా గడిపారు. కూకట్‌పల్లి ఆర్టీసీ డిపో మేనేజర్ మహ్మద్ ఇషాక్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు. అనంతరం ఆర్టీసీ కండక్టర్స్, డ్రైవర్సు, మెకానిక్స్‌తో అంత్యాక్షరి, పాటల పోటీలు, వివిధ రకాల ఆటలతో సరదాగా గడిపారు. అంతకుముందు ఉత్తమ డ్రైవర్స్ 5, కండక్టర్స్ 5, మెకానిక్ 5కు ప్రశంసపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ శ్రీలత, ఎంఎఫ్ రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

అంజీర్ చెరువును అభివృద్ధి చేయండి

ఆల్విన్‌కాలనీ: తెలంగాణఎక్సైజ్, టూరిజం శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావును శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ నాయకుడు ఉప్పల ఏకాంత్‌గౌడ్ మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని అతి పెద్ద అంబీర్ చెరువును అభివృద్ధి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు పల్నాటి అశోక్, జితేందర్, పుష్పేందర్, అల్వాల రమేష్, నాగరాజు, మహిపాల్ తదితరులు పాల్గొన్నారు.

బస్తీ దవాఖానాలో దొంగలు పడ్డారు

సర్జికల్, బీపీ మెషిన్లు, ఇతర సామగ్రి ఎత్తుకెళ్లిన వైనం

దుండిగల్: బస్తీ దవాఖానాలో దొంగలు పడ్డారు. అందులోని సర్జికల్ పరికరాలు, బీపీ మెషిన్లు, ఇతర సామగ్రిని దొంగలించారు. ఈ సంఘటన దుండిగల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. దుండిగల్ మున్సిపాలిటీ డి.పోచంపల్లి పరిధి సర్వే నం.120లో ఆరు నెలల క్రితం బస్తీ దవాఖానా ఏర్పాటు చేశారు. అందులో సామగ్రిని సమకూర్చారు. కానీ ఎన్నికల నేపథ్యంలో దవాఖానాను ప్రారంభించడంలో తీవ్ర ఆలస్య అయ్యింది. దీంతో అప్పటి నుంచి దవాఖానాకు తాళం వేసి ఉంది. ఇదే అదనుగా భావించిన కొందరు గుర్తు తెలియని వ్యక్తులు తాళాలు పగలగొట్టి అందులోని సామగ్రిని ఎత్తుకెళ్లారు. అంతేకాకుండా ప్లాస్టిక్ కుర్చీలను ధ్వంసం చేయడం గమనార్హం. డిసెంబరు 23వ తేదీన దొంగతనం జరిగినట్లు వైద్య సిబ్బంది ఆలస్యంగా గుర్తించారు. మంగళవారం డాక్టర్ శివాని ఫిర్యాదు మేరకు దుండిగల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కేపీహెచ్‌బీ ఇన్‌స్పెక్టర్‌కు శుభాకాంక్షలు

భాగ్యనగర్‌కాలనీ: కేపీహెచ్‌బీకాలనీ ఇన్‌స్పెక్టర్‌గా ఇటీవల పదవీ బాధ్యతలు చేపట్టిన సీహెచ్. వెంకన్నను గ్రేటర్ హైదరాబాద్ ఆల్ ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం అధ్యక్షుడు కర్క నాగరాజు మంగళవారం కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయనకు బాబా సాహెబ్ అంబేడ్కర్ చిత్రపటాన్ని బహూకరించారు. ఈ కార్యక్రమంలో కుతాడి కృష్ణ, సప్పిడి భాస్కర్, కర్ర చిన్న, సాయి తదితరులు పాల్గొన్నారు.

కులగణన కోసం నేడు సత్యాగ్రహం

రాయదుర్గం: ఆలిండియా ఓబీసీ స్టూడెంట్స్ అసోసియేషన్(ఏఐఓబీసీఎస్ఏ) ఆధ్వర్యంలో హెచ్‌సీయూ ప్రధాన గేటు ఎదుట నేడు(బుధవారం) ఓబీసీ సత్యాగ్రహం జరగనుంది. కులగణన, సామాజిక న్యాయం కోసం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 వరకు ఈ కార్యక్రమం చేస్తున్నట్లు అసోసియేషన్ జాతీయ అధ్యక్షుడు కిరణ్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో వైఎస్ఆర్‌సీపీ రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య, ప్రొఫెసర్ హరగోపాల్, ప్రొఫెసర్ వెంకటేశ్, ఆళ్ల రామకృష్ణ, భాగ్యలక్ష్మి, విద్యార్థులు పాల్గొంటారని చెప్పారు.

ఇంటింటికీ రామయ్య అక్షతల పంపిణీ

మూసాపేట: మూసాపేటలోని పలు బస్తీలలో అయోధ్య నుంచి వచ్చిన పవిత్రమైన అక్షతలను మూసాపేట డివిజన్ బీజేపీ అధ్యక్షుడు పిట్ల మనోహర్ పంపిణీ చేశారు. ఈనెల 22న అయోధ్య రామమందిర ప్రారంభోత్సవం సందర్భంగా ఇంట్లో పూజలు నిర్వహించి దీపాలు వెలిగించాలని కోరారు. అదేరోజు అయోధ్య నుంచి వచ్చిన ఈ అక్షతలను తలపై వేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో యువమోర్చా అధ్యక్షుడు ప్రశాంత్ రెడ్డి, మహిళా నాయకురాలు జానకీ, ఎస్.రాజేశ్వరి, అనూష, దీప్తి, చంద్రకళ, సాయి, శ్రీరామ భక్తులు పాల్గొన్నారు.

కూకట్‌పల్లి: అయోధ్య రామయ్య అక్షతలను మంగళవారం బీజేపీ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు పన్నాల హరీష్‌రెడ్డి ఇంటింటికీ వెళ్లి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఈనెల 22న అయోధ్య మందిరం ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకొని ప్రతి ఒక్కరూ ప్రత్యేక పూజలు నిర్వహించి అక్షింతలను వేసుకోవాలన్నారు.


అయోధ్య రామయ్య అక్షతలను పంపిణీ చేస్తున్న పిట్ల మనోహర్


అక్షతల పంపిణీలో పాల్గొన్న పన్నాల హరీష్‌రెడ్డి తదితరులు

భక్తిశ్రద్ధలతో ఇరుముడి కార్యక్రమం


ఇరుముడి కార్యక్రమంలో పాల్గొన్న కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డి

బాలానగర్: హెచ్ఏఎల్ టౌన్‌షిప్‌లోని అయ్యప్ప దేవాలయంలో చందామా రక్షన్ గురుస్వామి, అరుణ్ గురుస్వామి ఆశీస్సులతో ఆర్‌కే పటేల్ తనయుడు ప్రమోద్ గంటస్వామి ఆధ్వర్యంలో మంగళవారం ఇరుముడి కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా 45 మంది అయ్యప్ప స్వాములతో కలిసి కార్పొరేటర్ పూజలో పాల్గొన్నారు. శబరిమల అయ్యప్ప దర్శనం మంచిగా కావాలని కోరుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్వాములు మురళీధరన్, సాగర్, మూర్తి, విజయ్, శేఖర్, సూర్యకిరణ్, మధు, చిన్న, ఫతేనగర్ శివాలయం కమిటీ చైర్మన్, సభ్యులు పాల్గొన్నారు.

మల్కాజిగిరి ఎంపీ టికెట్ స్థానికులకే ఇవ్వాలి

- స్థానిక నాయకులు, కేడర్ అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలి
- రాబోయే పురపాలిక, జీపీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకోవాలి
- కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, ఎంపీ లక్ష్మణ్‌కు కూడా చెప్పాం
- మీడియా సమావేశంలో బీజేపీ రాష్ట్ర, శివారు జిల్లాల నేతలు

సాక్షి, మేడ్చల్ జిల్లా: దేశంలో అతిపెద్ద పార్లమెంట్ నియోజకవర్గమైన మల్కాజిగిరి టికెట్ స్థానికులకు మాత్రమే కేటాయించాలని బీజేపీ నాయకులు కోరారు. స్థానికేతరులకు టికెట్ ఇవ్వవద్దని పార్టీ అధిష్టానానికి విజ్ఞప్తి చేశారు. మంగళవారం నగరంలో బీజేపీ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు కొంపల్లి మోహన్‌రెడ్డి, రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి, మేడ్చల్ అర్బన్ జిల్లా అధ్యక్షుడు వన్నాల హరీష్ రెడ్డి, రూరల్ జిల్లా అధ్యక్షుడు పటోళ్ల విక్రంరెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఏనుగు సుదర్శన్‌రెడ్డి మీడియా సమావేశం నిర్వహించారు. మల్కాజిగిరి లోక్‌సభ స్థానంలో దాదాపు 38 లక్షల ఓటర్లు ఉంటారని, మినీ భారత్‌గా.. ఈ నియోజకవర్గానికి గుర్తింపు ఉందని వారు తెలిపారు. స్థానికేతరులకు ఎంపీ టికెట్ కేటాయిస్తే పార్టీకి నష్టం కలుగుతుందని బీజేపీ నేతలు ఆవేదన వ్యక్తం చేశారు. టికెట్ కేటాయింపులో ఈ ప్రాంత ప్రజలు, పార్టీ నాయకులు, కార్యకర్తల అభిప్రాయాలను అధిష్టానం పరిగణలోకి తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. మల్కాజిగిరి పార్లమెంట్ పరిధిలోని 7 అసెంబ్లీ సెగ్మెంట్లలో ప్రతిభావంతులు, ప్రభావశీలురైన నాయకులు ఎందరో ఉన్నారని గుర్తు చేశారు. పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలలోని ఏ నాయకుడికి ఎంపీ టికెట్ కేటాయించినా కలిసికట్టుగా పనిచేసి గెలిపించుకుంటామని వారు స్పష్టం చేశారు. జీహెచ్ఎంసీ, మున్సిపల్, గ్రామ పంచాయతీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని మల్కాజిగిరి పార్లమెంట్ అభ్యర్థి ఎంపికలో స్థానిక నాయకత్వానికి ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల ఫలితాలతో నిరుత్సాహానికి గురైన కార్యకర్తల్లో ఆత్మస్థైర్యం నింపేందుకు స్థానిక నాయకులకు ఎంపీ టికెట్ కేటాయించాలని అధిష్టానాన్ని బీజేపీ నాయకులు కోరారు. ఈ విషయాన్ని కేంద్ర మంత్రి,బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి,రాజ్యసభ సభ్యుడు, బీజేపీ జాతీయ నాయకులు డా.కె.లక్ష్మణ్ దృష్టికి కూడా తీసుకువెళ్లినట్లు వారు పేర్కొన్నారు. సమావేశంలో బీజేపీ మేడ్చల్ రూరల్ జిల్లా ప్రధాన కార్యదర్శి జిల్లాల తిరుమల్‌రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి గాలి సంపత్ యాదవ్, నాయకులు భరత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి


శిబిరంలో పాల్గొన్న గర్భిణులు

మోతీనగర్: గర్భిణులు పౌష్టికాహారం తీసుకుంటూ.. క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకుంటూ.. మందులు వాడితే పుట్టబోయే శిశువు ఆరోగ్యంగా ఉంటారని నీలిమ ఆస్పత్రి కరస్పాండెంట్ డాక్టర్ పి. శ్రీనివాసులు పేర్కొన్నారు. మంగళవారం పాండురంగనగర్‌లోని ఆస్పత్రి ఆవరణలో గర్భిణులకు ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులకు వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు అందజేశారు.

సీనియర్ సిటిజన్స్‌కు 20, 21 తేదీల్లో క్రీడా పోటీలు

సనత్‌నగర్: మోడల్‌కాలనీ సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యాలయం (సంస్కృతి భవనం)లో ఈ నెల 20, 21 తేదీల్లో సీనియర్ సిటిజన్స్‌కు క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆసరా సర్కిల్ కమిటీ ఉపాధ్యక్షులు జేఎస్‌టీ శాయి ఒక ప్రకటనలో తెలిపారు. జీహెచ్ఎంసీ ఖైరతాబాద్ సర్కిల్-17 ఆసరా కమిటీ ఆధ్వర్యంలో జరిగే ఈ పోటీల్లో భాగంగా క్యారమ్స్ (సింగిల్స్, డబుల్స్), జీకే (జనరల్ నాలెడ్జ్), చదరంగం, టగ్గాఫ్ వార్, మ్యూజికల్ చైర్, బ్రిస్క్ వాకింగ్ తదితర పోటీలు జరుగుతాయన్నారు. 60 ఏళ్ల పైబడిన వృద్ధులు ఈ పోటీలకు అర్హులుగా పేర్కొన్నారు. ఆసక్తి ఉన్నవారు ఈ నెల 19వ తేదీలోపు తమ పేర్లను నమోదు చేసుకోవాలని మరిన్ని వివరాలకు (ప్రసాద్ 89779 14856) (వైకేడీ ప్రసాద్ 94939 74300)ను సంప్రదించాలన్నారు.

కాలనీ అసోసియేషన్ల కేలండర్ల ఆవిష్కరణ

భాగ్యనగర్‌కాలనీ: హెచ్ఎంటీ శాతవాహననగర్ కాలనీ అసోసియేషన్ నూతన సంవత్సర కేలండర్‌ను మంగళవారం శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సంక్షేమ సంఘం గౌరవ ఉపాధ్యక్షుడు శ్రీనివాసరావు, సీతారాముడు, జనరల్ సెక్రటరీ యాదిరెడ్డి, ట్రెజరర్ మదన్‌మోహన్, మాజీ జాయింట్ సెక్రటరీ వెంకట్రామరెడ్డి, కాలనీ బీఆర్ఎస్ నాయకులు అందే నర్సింలు, ప్రకాష్, వెంకటరావు, హనుమంతరాజు, రామనాథం, సత్యనారాయణ, బాబూరావు, రామ కోటేశ్వరరావు, పాల్గొన్నారు.

బాలానగర్ రెడ్డి సంఘం..

బాలానగర్: సమాజ హితం కోసం రెడ్డి సంఘం సభ్యులు అంతా కలిసి పనిచేయాలని బాలానగర్ కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం బాలానగర్‌లోని స్మార్ట్ హోటల్‌లో బాలానగర్ రెడ్డి సంఘం ఆధ్వర్యంలో నూతన సంవత్సరం కేలండర్‌ను ఆయన ఆవిష్కరించారు.కార్యక్రమంలో బాలాజీనగర్ మాజీ కార్పొరేటర్ పన్నాల కావ్యారెడ్డి, సంఘం అధ్యక్షుడు కె. ఉపేందర్‌రెడ్డి, నాయకులు వెంకటరెడ్డి, రమేష్‌రెడ్డి, దేవేందర్‌రెడ్డి, సులోచనరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం



మోతీనగర్: అన్నిదానాల కన్నా అన్నదానం మహా గొప్పదని మోతీనగర్ కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ మాజీ అధ్యక్షులు నలమాల్పు అంజిరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఎర్రగడ్డ మానసిక ఆస్పత్రిలో రోగులకు వారి సహాయకులకు మోతీనగర్ చెందిన గొట్టు సోమేశ్వరరావు ఆధ్వర్యంలో ఉచిత అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యంగా నగరంలోని ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చే రోగులు వారి సహాయకుల కోసం అన్నదానం చేస్తున్నామని వారు తెలిపారు. కార్యక్రమంలో ఎంసీహెచ్ఎస్ మాజీ అధ్యోఉలు బీజమల్ల నాగేశ్వరరావు, వాసుదేవరావు తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం


రమణారావు (ఫైల్)

బాలానగర్: మార్కెట్‌కు వెళ్లి కూరగాయలు తెచ్చి ఇంట్లో ఎవరికీ చెప్పకుండా ఓ వ్యక్తి బయటకు వెళ్లి తిరిగి రాని సంఘటన బాలానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ భాస్కర్ తెలిపిన వివరాల ప్రకారం.. బాల్‌రెడ్డినగర్‌కు చెందిన రమణారావు, అనసూయ దంపతులు తమ కుటుంబ సభ్యులతో కలిసి నివాసం ఉంటున్నారు. పొద్దున్నే లేచి మార్కెట్‌కి వెళ్లి కూరగాయలు తెచ్చిన రమణారావు (46) తన ఫోన్ ఇంట్లోనే పెట్టేసి ఇంట్లో నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు పలు చోట్ల గాలించినప్పటికి ఆచూకీ లభ్యం కాలేదు.భార్య అనసూయ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లుగా పోలీసులు తెలిపారు.